

# సూర్య

www.suryaa.com


19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,19 డిసెంబర్ 2025 | 8 పేజీలు


## 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో...

# అణగారిన వర్గాలకింకా అన్యాయమా?





- కాకినాడ సంకల్ప సభలో సుమన్ ధ్వజం
- సుమన్‌కు 'బీసీ రత్న' పురస్కారం!
- బీసీల ఐక్యత - చైతన్యానికి ప్రతీక
- కాకినాడలో ఘనంగా 'బీసీ సంకల్ప సభ'

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యంగా, వారికి రాజ్యాధికారంలో తగిన వాటా దక్కాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ పిలుపునిచ్చారు. కాకినాడ కర్ణంగారి సెంటర్లోని వీర కమల్ థియేటర్ ప్రాంగణంలో రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బీసీ సంకల్ప సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు సుమన్‌కు పూల వర్షంతో,భారీగజమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో సుమన్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**రాజ్యాధికారంలో వాటా** : బాబాసాహేబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కుల వల్ల బీసీలకు రిజర్వేషన్లు దక్కుతున్నా, స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు దాటినా కొన్ని కులాలకు నేటికీ రాజకీయ ప్రాధాన్యత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎం పదవి : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో బీసీ కులాల అభివృద్ధి కోసం బీసీ నాయకులకు 'ఉపముఖ్యమంత్రి' పదవిని కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యత ప్రభుత్వాలు కేవలం మాటలకే పరిమితం కాకుండా, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో పూర్తిస్థాయి రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

**ఘన సత్కారం - 'బీసీ రత్న' అవార్డు:**

బీసీల సమస్యలపై స్పందిస్తూ, వారికి అండగా నిలుస్తున్న సుమన్‌ను రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవి, ప్రెసిడెంట్ శొంఠి నాగరాజులు ఘనంగా సత్కరించారు. సుమన్‌కు 'బీసీ రత్న' అవార్డును ప్రదానం చేసి, శాలువాలతో సత్కరించారు.

రాష్ట్ర బీసీ సంఘం ప్రెసిడెంట్ శొంఠి నాగరాజు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం

- తరువాయి 2లో..

# దేశంలో క్యాన్సర్ ఆసుపత్రుల విస్తరణకు కేంద్రం చర్యలు

- విశాఖ 'హెూమి బాబా' క్యాన్సర్ ఆసుపత్రి విస్తరణకు ప్రతిపాదనలు
- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** దేశంలో నానాటికి పెరుగుతున్న క్యాన్సర్ మహమ్మారిని అరికట్టడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దేశంలో ప్రైవేట్ భాగస్వామ్యంతో దశలవారీగా క్యాన్సర్ ఆసుపత్రులను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పబ్లిక్ గ్రీవెన్స్, ప్రధాని కార్యాలయ శాఖ మంత్రి డా.జితేంద్ర సింగ్‌తెలిపారు.దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ ఆసుపత్రుల నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై గురువారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

టాటా మెమోరియల్ సెంటర్ (టిఎంసి) భాగస్వామ్యంతో దేశంలో పలు ప్రాంతాల్లోక్యాన్సర్ఆసుపత్రుల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖలో హెూమి భాభా కేన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్ ఇప్పటికే పూర్తిస్తాయి సమగ్ర క్యాన్సర్ ఆసుపత్రిగా సేవలందిస్తుందని తెలిపారు. 2022లో రూ.556.58 కోట్ల వ్యయంతో అణుశక్తి శాఖ ఆధ్వర్యంలో టాటా మెమోరియల్ సెంటర్ నెలకొల్పిన ఈ ఆసుపత్రిలో అదునాతన క్యాన్సర్ వైద్య సేవలు అందుతున్నాయని, భవిష్యత్తులో ఆసుపత్రిని మరింత విస్తరించే ప్రతిపాదన ఉందన్నారు. ఏపీ లో రంగరాయ వైద్య కళాశాలతో పాటు మరో 18 ప్రభుత్వ, ప్రైవేటు కేన్సర్ ఆసుపత్రులు నేషనల్ కేన్సర్ గ్రిడ్ (ఎన్‌సిజి) కింద రిజిష్టర్ అయ్యాయని కేంద్ర మంత్రి వివరించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన విజయవంతం చేయాలి

-మంత్రి దుర్గేష్, బూరుగుపల్లి శేషారావు



**పెరవలి,మేజర్‌న్యూస్ :** ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం వేస్తోన్న కీలక అడుగుకు శుభ ముహూర్తం ఖరారైంది. రూ.3,050 కోట్లతో చేపట్టే వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ నిర్మాణపనులకుడిసెంబర్ 20న పెరవలిలోని ఎన్ హెచ్ 216ఏ దగ్గర ఆర్ కే రైస్ మిన్ సమీపంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌స్వయంగా శంకు స్థాపన చేయనున్నారు.ఈసభనిర్వహణ ఏర్పాట్లను డిసెంబర్ 18వ తేదీ గురువారం మంత్రి దుర్గేష్ ఏపీఐఐదిసి చైర్మన్ నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బురుగుపల్లి శేషారావులు సంయుక్తంగా పరిశీలిం చారు అధికారులకు ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. జనసేన,తెదేపా,బీజేపీపార్టీల నాయకులు, కార్యకర్తలు ఉమ్మడిగా కృషి చేసి పర్యటన విజయ వంతం చేయాలని వారు కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా అధునాతన సాంకేతికతతో సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ధవళేశ్వరం, బొబ్బర్లంక, వేమగిరి సమీపంలో నుండి గోదావరి జలాలు శుద్ధి చేసి తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, ఏలూరు, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ తదితర 5జిల్లాల్లోని 23నియోజకవర్గాలు, 66 మండలాల్లోని 67.82 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరనుంది. అందులో భాగంగా రూ.1,650 కోట్లతో ఉమ్మడి తూర్పుగోదావరిలోని కాకినాడ, డా.బి.ఆర్అంబేద్కర్ కోనసీమ,ఈస్ట్‌గోదావరిలోని 11 నియోజక వర్గాలు, 32 మండలలాల్లోని 39.64 లక్షల మంది ప్రజలకు,

- తరువాయి 2లో..

## సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోపి పోటీలను

# విజయవంతం చేయాలి

- అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:**సర్ఆర్థర్‌కాటన్ గోదావరి ట్రోఫీ పడవ, ఈత తదితర పోటీలకు త్వరిగతిన సర్వంసిద్ధంచేయాలని అధికారులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆర్డిఓ శ్రీకర్‌తో పలుశాఖలఅధికారులు,ప్రజాప్రతినిధులు, నాయుకుల తో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు ముందుగా నిర్వహించనున్న ట్రోఫీ పోటీల సమయం దగ్గర పడు తుండటంతో అధికారులు పనులు పూర్తి చేయాలని సూచించారుఅధికారులంతా సంసిద్ధంగా ఉండాలని, కేరళ పడవ పోటీలను మైమరిపించేలా ఆత్రేయపురంలో నిర్వహిస్తున్న సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాలకు అన్ని శాఖల అధికారులు సంసిద్ధంగా ఉండాలని, ఈసారి నిర్వహించే సంబరాలకు ప్రభుత్వ నుంచి సహకారం అందుతుందని, జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీల ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు.స్థానికంగా ఏర్పాటు చేసిన కమిటీ, ప్రభుత్వం కలసి ఈ సంబరాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రాగన్ పడవ పోటీలు, ఈతల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగేసినీ ఆర్కెస్ట్రా వంటి వినోద కార్యక్రమాలను సైతం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పర్యాటకానికి

- తరువాయి 2లో..

# ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వైయస్సార్ విగ్రహంతో ఉన్న వాహనం



**రావులపాలెం, మేజర్ న్యూస్** : మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సిపి ఇచ్చిన పిలుపుమేరకు కోటి సంతకాల ఉద్యమ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుండి సేకరించిన సంతకాల ప్రతులను తీసుకెళ్లే వాహనంపై జిల్లా పార్టీ అధ్యక్షుడు చెర్ల జగ్గిరెడ్డి ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహంతో కూడిన వాహనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గురువారం తాడేపల్లి నుంచి కోటి సంతకాల ప్రతులు ఉండే వాహనాల్ని లోక్‌భవన్‌కు జెండా ఊపి పంపిన వైయస్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డిను పిలిపించుకుని పక్కన పెట్టుకొని దివంగత నేత వైఎస్సార్ విగ్రహంతో ఉన్న వాహనాన్ని ముందు పెట్టి జెండా ఊపారు జగన్.

దీంతో సంతోషంతో జగ్గి రెడ్డి ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ ఆనందాన్ని ఒక ప్రకటన ద్వారా మీడియాకు తెలిపారు.

# కేంద్రం కళ్ళు తెరిపించేలా రజకుల నిరసన

**– ఢిల్లీ వేదికగా ఏపీ ఓబీసీ నేతల ఘర్జన**



**న్యూఢిల్లీ / ఏలూరు,మేజర్ న్యూస్ :** రజక సామాజిక వర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలనే దశాబ్దాల కాలపు డిమాండ్‌ను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. చాటపర్తి పోసి బాబు మాట్లాడుతూ రజకులు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, పక్క రాష్ట్రాల్లో వారికి ఉన్న ఎస్సీ హోదాను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఇది కేవలం డిమాండ్ మాత్రమే కాదని, వారి సామాజిక భద్రతకు సంబంధించిన రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఆయన స్పష్టం చేశారు. బీసీల జనాభా గణనను తక్షణమే చేపట్టాలని నాయకులు డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరగడం లేదని,కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ఎత్తి చూపారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే బీసీలను వాడుకుంటున్నారని, చట్టసభల్లో (పార్లమెంట్ అసెంబ్లీలు) బీసీలకు కనీసం 33శాత ం రిజర్వేషన్లు కల్పించే వరకు ఈ పోరాటం ఆగదని ఈ సందర్భంగా నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత్ ఓబీసీ జాతీయ కార్యదర్శి డా ఇప్పనగండ్ల శ్రీనివాస్ రాష్ట్ర మహిళా కార్యదర్శి దేవరకొండ రమాదేవి మహిళా అధ్యక్షురాలు మనుబర్తి లలిత రాష్ట్ర కార్యదర్శి తులసిపాటి కృష్ణంరాజు కొనిదే గోపి కృష్ణ బత్తుల వెంకటేష్ రామలక్ష్మి సోనీ తదితరులు పాల్గొన్నారు..

# 20 నుండి జరిగే హస్తకళల ఎక్స్‌పోకు 15 రాష్ట్రాల ప్రతినిధులు

**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఈనెల 20 నుండి 24 వరకు రుస్తుంబాధ లోని అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్లో నిర్వహించ తలపెట్టిన రెండవ హస్తకళల ఎక్స్ పో కు 15 రాష్ట్రాల ప్రతినిధులు హాజరై స్టాల్స్ నిర్వహించనున్నట్లు ఐ ఎల్ టి సి కన్వీనర్ కలవకలను నాగ తులసి రావు తెలిపారు. గురువారం ఐఎల్‌టిసిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన మొదటి ఎక్స్పోకు సుమారు 25వేల మంది హాజరైనట్లు తెలిపారు.

దేశంలోని వివిధ రాష్ట్రాలలో సాంప్రదాయ బద్ధంగా తయారుచేసే గృహోపకరణాలతో పాటు వివిధ రకాల వస్తువులు అమ్మకాలు జరుగుతాయి అన్నారు. ఈ సందర్భంగా కిడ్స్ జోన్,ఫుడ్ కోర్ట్ తదితర ఏర్పాటు చేశామన్నారు.

ఈ ఐదు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. బొంబాయి, ఢిల్లీ నుండి బయ్యర్లు వచ్చి ఆర్డర్లు ఇచ్చి కొనుగోలు చేస్తారని నాగ తులసి రావు తెలిపారు. హస్తకళల శాఖ మాజీ చైర్మన్ ఆర్ కే పాస్సి,ఈడి ఆర్కే వర్మ సహకారం అందిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ 20వ తేదీన లాంచనముగా ప్రారంభిస్తారన్నారు. నరసాపురం ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగ తులసి రావు కోరారు. ఈ సమావేశంలో తాండాల నటేష్ కుమార్, అడ్డగళ్ళ బాబు, కలవకలను రాజీవ్ చంద్ర, ఈపిసి హెచ్ డిడి రాజేష్ సింగ్, అడ్డగల సాయిబాబా, కావలి నాని తదితరులు పాల్గొన్నారు.

# 13 ఏళ్ల బాలుడికి అరుదైన గుండె ఆపరేషన్

**– వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు వెల్లడి**



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామానికి చెందిన వేణు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు వేణు తెలిపిన వివరాల ప్రకారం 13 సంవత్సరాలు వయసు కలిగిన నాగ సూరిబాబు అనే బాలుడికి అరుదైన గుండె ఆపరేషన్ చేశారు. గుండెలో చిన్నపాటి రంధ్రం ఏర్పడడంతో శస్త్రచికిత్స చేసి రంధ్రాన్ని మూసివేయడానికి డివైస్ వేసినట్లు తెలియజేశారు.

గుండెలో ఇటువంటి రంధ్రాలు ఏర్పడడం వల్ల ఆయాసం వచ్చి పిల్లలు ఇబ్బంది పడుతూ ఉంటారని, అంతేకాకుండా ఎదుగుదలలో లోపాలు ఏర్పడతాయని, వాటి నివారణకు ఇటువంటి ఆధునిక శస్త్ర చికిత్స అవసరమని అన్నారు. సహజంగా ఇటువంటి వాటికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి ఉంటుందని, ఓపెన్ హార్ట్ సర్జరీ చేయకుండా, కాలు ద్వారా నేరుగా రంధ్రాన్ని మూయడానికి డివైస్ క్లోజర్ ( గుండెలోని గదుల మధ్య రంధ్రం మూసివేత) ఎ ఆధునిక శాస్త్ర చికిత్స చేసి, బాబు జీవిత కాలాన్ని పెంచినట్లు తెలియజేశారు. ఈ అరుదైన ఆపరేషన్ చేసిన డాక్టర్ వేణును బాబు కుటుంబ సభ్యులు కొనియాడారు. వేణు కార్డియాక్ కేర్ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాస్పటల్ మేనేజర్ పాతూరి రాజశేఖర్ తెలియ జేశారు.

## 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో...

# అణగారిన వర్గాలకింకా అన్యాయమా?

మొదటిపేజి తరువాయి

దక్కేలా, అన్ని కులాలను కలుపుకుని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కర్రి గోపాలకృష్ణ, మాకిరెడ్డి భాస్కర్, గణేష్ బాబు, రాయుడు నాగేశ్వరరావు, పెంకే రాజు, సర్పంచ్ శీలంనాగేశ్వరరావు,కొండావినాయక్,ఆవుపాటి ఉమా శంకర్, నాయి బ్రాహ్మణ సంఘం నేతలు సత్యకుమార్, విన్నకోట వెంకటేష్ తదితరులతో పాటు పెద్దసంఖ్యలో బీసీ మహిళలు, యువత పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన

# విజయవంతం చేయాలి

మొదటిపేజి తరువాయి

రూ.1,400 కోట్లతో ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లాలోని ఏలూరు, పశ్చిమగోదావరి, ఈస్ట్‌గోదావరి(కొవ్వూరు,నిడదవోలుతదితర ప్రాంతా లు) 12నియోజకవర్గాలు,34మండలాల్లోని 28.18 లక్షల ప్రజలకు త్రాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. జల్ జీన్ మిషన్ నిధులతో రెండు దశల్లో నిర్మాణ పనుల పూర్తికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది.

ఈ నేపథ్యంలో 2 ఏళ్లలో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనుల పూర్తికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. గోదావరి డెల్టా ప్రాంతంలో భూగర్భ జలాలు ఉప్పునీరుగా మారడం, కలుషితం కావడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఈ ప్రాజెక్ట్ ను సకాలంలో పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి, నిడదవోలు శాసనసభ్యులు కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. అంతేగాక ధవళేశ్వరం వద్ద అత్యాధునిక సాంకేతికతతో కూడిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించి గ్రావిటీ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నీటిని శుద్ధి చేసి పైప్ లైన్ల ద్వారా ఇంటింటికి తాగునీరు అందించనున్నామన్నారు. ఇన్నేళ్లుగా అఖండ గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ గోదావరి వాసులకు త్రాగునీరు సమస్య వెంటాడేదని, కేంద్ర సహకారం, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ చొరవతో ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గ పర్యటనకు తొలిసారిగా విచ్చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఘనస్వాగతం పలకాలని, కార్యక్రమంలో ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పర్యటనను దిగ్విజయం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సభ నిర్వహించే ప్రాంగణానికి మంత్రి దుర్గేష్‌తో సహా కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డి.ఎస్.పి జి దేవకుమార్‌తో పాటు అన్ని విభాగాలకు చెందిన అధికారులు, కూటమి నాయకులు, మెగా సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.

## సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫి పోటీలను

# విజయవంతం చేయాలి

మొదటిపేజి తరువాయి

అనువుగా ఉన్న మన ప్రాంతంలో పర్యాటకంగాను సంబరాలలో కలిసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మన ఊరు, మన పండుగ,మనసంబరాలు అన్నట్టుగా భాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా అందరూ సహకరించాలని ఎమ్మెల్యేకోరారు. పోటీలలో పాల్గొనే వారికి వసతుల ఏర్పాటు, అలాగే సందర్శనకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండాచర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పనిచేసి ఈ గోదావరి ట్రోఫీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్ వెంకట్ రామన్, తాసిల్దార్ రాజేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ రామచంద్రమూర్తి, ఆర్అండ్‌బి డిఈ రాజేంద్ర, పర్యాటక శాఖ అధికారి అన్వర్, డిప్యూటీ ఎంపీడీవో ఎం.ఆర్.కే.రాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, కూటమి నాయకులు ముళ్లపూడి భాస్కరరావు, పి.ఎస్.రాజు, జుజ్జువరపు హరిబాబు, వెచ్చ అనిల్, నరాలశెట్టి వెంకన్న, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జెఎన్టీయుకెకు 5-స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికేషన్

**– తొలి విశ్వవిద్యాలయంగా చరిత్రకెక్కిన జేఎన్‌టీయూ కాకినాడ**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ, కాకినాడ మరో కీలక మైలురాయిని సాధించింది. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో 5–స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికేషన్ పొందిన తొలి విశ్వవిద్యాలయంగా జేఎన్‌టీయూ కాకినాడ చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ISO) సర్టిఫికేషన్ సంస్థ అయిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ నిర్వహించిన సమగ్ర మూల్యాంకనం అనంతరం ఈ సర్టిఫికేషన్ మంజూరు చేయబడింది. ఈ అంచనాలో విశ్వవిద్యాలయానికి సంబంధించిన అకడమిక్, పరిపాలనా, పర్యావరణ ఎనర్జీ మేనేజ్‌మెంట్ మరియు జెండర్ సెన్సిటైజేషన్ వ్యవస్థలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పరిశీలించారు. జేఎన్‌టీయూ కాకినాడను క్రింది ప్రమాణాల కింద మూల్యాంకనం చేసి సర్టిఫికేషన్ అందించారు :

1. ISO 9001– క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్: విద్యా విధానాలు, పరిశోధనాకార్యకలాపాలు,ఇన్నోవేషన్ హబ్‌లు మరియు విశ్వవిద్యాలయ సేవల నాణ్యతకు గుర్తింపు.
2. ISO 14001 – ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్: పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఇనిషియేటివ్‌లు మరియు పర్యావరణహిత చర్యల పట్ల నిబద్ధతకు గుర్తింపు.
3. ISO 50001 – ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్: సోలార్ పవర్ వినియోగం, ఎల్‌ఈడీ లైటింగ్, శక్తి సమర్థవంతమైన వ్యవస్థల ద్వారా శక్తి సంరక్షణ చర్యలకు గుర్తింపు.
4. AAA రేటింగ్: అకడమిక్ మరియు పరిపాలనా ఆడిట్లలో ప్రతిభకు గాను గుర్తింపు.
5. జెండర్ సెన్సిటైజేషన్ సర్టిఫికేషన్: సమానత్వం, సమావేశం మరియు లింగ సమానతకు అనుకూల విధానాల అమలుకు గుర్తింపు.

అన్ని మూల్యాంకన ప్రమాణాల్లో విశిష్ట ప్రదర్శన కనబరిచిన నేపథ్యంలో జేఎన్‌టీయూ కాకినాడకు 5–స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికేషన్ అందజేయబడింది. ఇది నాణ్యమైన విద్య, సుస్థిర అభివృద్ధి మరియు సంస్థాగత ఉత్తమత పట్ల విశ్వవిద్యాలయం చూపుతున్న కట్టుబాటును ప్రతిభింబిస్తుంది. ఈ ఘనతతో జేఎన్‌టీయూ కాకినాడ ఉన్నత విద్యా రంగంలో తన అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకుని, రాష్ట్రం మరియు ప్రాంతంలోని ఇతర విశ్వవిద్యాలయాలకు ఒక ప్రమాణంగా నిలుస్తోంది.ఈ సందర్భంగా జేఎన్‌టీయూ కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ, "5–స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికేషన్ పొందడం మా విశ్వవిద్యాలయానికి గర్వకారణం, ఈ సర్టిఫికేషన్లు విద్యా ప్రమాణాలను నిరంతరం మెరుగుపరచడంలో, పారదర్శకమైన పరిపాలనను అమలు చేయడంలో, అలాగే పర్యావరణ పరిరక్షణ మరియు విద్యుత్ శక్తి సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేసే సంస్థగా జేఎన్‌టీయూ కాకినాడను నిలబెట్టేందుకు ఇవి దోహదపడతాయి, ఈ గుర్తింపు ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలో మెరుగైన అవకాశాలు, అలాగే జాతీయ–అంతర్జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయప్రతిష్ఠ మరింత పెరుగుతుందని" తెలిపారు. 5–స్టార్ క్వాలిటీ సర్టిఫికేషన్‌ను విశ్వవిద్యాలయం సాధించడంలో సహకరించిన బోధనా,బోధనేతరమరియు విశ్వవిద్యాలయ సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వారి సమిష్టి కృషి, అంకితభావం మరియు సహకారంతోనే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు.

# రైతులకు యూరియా కొరత రాకుండా కృషి

**– కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** పంట సాగులో రైతులకు యూరియా కొరత రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు, ఎరువుల వ్యాపారులు, సహకార సంఘాలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గురువారం రామచంద్రపురంలోని ప్రసన్న విగ్నేశ్వర ఫంక్షన్ హాలులో రామచంద్రపురం సబ్–డివిజన్ పరిధిలోని ఎరువులు వ్యాపారులు, సహకార సంఘాల సమన్వయ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు వాసంశెట్టి సత్యం పాల్గొని మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారులు దాళ్వా పంటకు అవసరమైన యూరియా రైతులకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ఎవరూ యూరియా కోసం అధైర్య పడవద్దని విడతల వారీగా పంటకు అవసరం మేర సరఫరా జరుగుతుందన్నారు. అలాగే ముందుగానే పంట విస్తీర్ణం మొత్తానికి కావాల్సిన యూరియా ఒకేసారి తీసుకుని నిల్వ ఉంచుకోవద్ధని, దాని వల్ల అవసరమైన రైతులకు తగిన సమయంలో ఎరువులు అందని పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. అలాగే ప్రైవేటు రిటైల్ ఎరువుల డీలర్లు సమస్యలు కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రామచంద్రపురం ఏవో మణిదీప్ మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి ప్రతి రైతుకు యూరియా సరైన సమయానికి చేరేలా పనిచేద్దామని కోరారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు అమ్రుత్, కె.గంగవరం ఏవో సద్గురు మూర్తి, రామచంద్రపురం డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మేకా సురేష్, ప్రసన్న విఘ్నేశ్వర సత్తి వెంకటరెడ్డి, కె గంగవరం డీలర్, సెక్రటరీ పెదబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, సొసైటీ సిఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఎరువులు వినియోగంపై అవగాహన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** సేంద్రీయ ఎరువులు వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి అన్నారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరంలో చెత్త నుంచి సంపద తయారు చేయు కేంద్రంలో గురువారం వాన పాములను వదిలారు. అదనపు కమీషనర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వారి ఆదేశాలు, జిల్లా పంచాయతీ అధికారి కె.పి.చంద్రశేఖర్ సూచనల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామ పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేయు కేంద్రాన్ని లోకల్ ట్రైనింగ్ సెంటర్‌ను సుప్రీమ్ లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా మార్చుటకు అధికారులు నిర్ణయించడం జరిగింది. అందులో భాగంగా తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ కొరకు, సేంద్రియ ఎరువు తయారీ కొరకు, ఐవిఆర్‌ఎస్ కాల్స్ విషయమై ప్రతి ఇంటికి అవగాహన కలిగిస్తున్నారు. దీనిలో భాగంగా ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లో సేంద్రియ ఎరువు తయారీ కొరకు ఐ.పోలవరం సర్పంచ్ కుంజం వెంకటలక్ష్మి రామకృష్ణ, ఎంపీపీ బంధం శ్రీదేవి కలిసి వానపాములను వర్మీ పిట్స్ లోపలికి వదలడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి ఆర్.పి.మోహన్,ఎఫ్‌టిసి సుబ్బారావు, కార్యదర్శి మహేష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రమదానం ద్వారా వాకింగ్ ట్రాక్ శుభ్రత

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం నడిబొడ్డున ఉన్న అల్లూరి సీతారామరాజు వాకింగ్ ట్రాక్ ఇటీవల చెత్తాచెదారాలతో నిండి ఉంది. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు అంతా కలిసి గురువారం అందులో పేరుకుపోయి ఉన్న ముల్లకంచెలు, చెత్తాచెదారాలు అన్నిటినీ తొలగించి తీర్చిదిద్దారు.

ఉదయం, సాయంత్రం వేళలో వందలాదిమంది వృద్ధులు, యువత అందరికీ అనువుగా ఉండేలా వాకింగ్ ట్రాక్ ను తీర్చిదిద్దారు. వీరిని గ్రామస్తులు అభినందించారు.



**మహారాజశ్రీ 3వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కాకినాడ**

**MUOP 173/2024**

Between:

ద్రాక్షవరపు తిరుపతమ్మ వగైరాలు – పిటిషనర్

మరియు

దండిబోయిన రామదాసు వగైరాలు – రెస్పాండెంట్

R2 : మోజో టూర్స్ అండ్ ట్రావెల్స్, ప్రోపరేటర్, ఉదయగిరి సురేష్

D.No: 4-4-024, కాకి వారి స్ట్రీట్, యానాం, పుదుచ్చెరి స్టేట్.

(మోజో బస్సు యజమాని బేరింగ్ నెం. PY 04 A 6618)

పై నంబరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం ది.02-01-2026వ తేదీన వాయిదా అయి వున్నది. ఆరోజు ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)

**K.V.Bhadra Rao**
**K.Srivani**
**K.S.Chandra Rao**
Advocates, Kakinada
Cell : 94401 77063

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# పారిశ్రామికవేత్తల తయారీకి ప్రోత్సాహం

- యువత సద్వినియోగం చేసుకుని ముందుకు వెళ్ళాలి
- సూక్ష్మ,చిన్న,మధ్య తరహా సంస్థల అవగాహన సెల్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రావులపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ఏర్పాటు ద్వారా యువత, మహిళలు ఉపాధి పొందాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. గురువారం రావులపాలెం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల గైడెన్స్ సెల్ ప్రారంభ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సమాజమే దేవాలయంగా భావించి సామాన్యులకు పట్టెడన్నం, పక్కా ఇల్లు, జనతా వస్త్రాలు అందించిన మహోన్నత నాయకుడు ఎన్టీ రామారావని కీర్తించారు. ఏడేళ్ల తన పాలనా కాలంలో కాంగ్రెస్ కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిన తీరు అనితర సాధ్యమన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు,మహిళలకు ఆస్తి హక్కు ఇచ్చిన ఘనత ఆయనదేనన్నారు.అటువంటిమహనీయునివిగ్రహాన్ని ఆవిష్కరించు కోవడం మనందరి అదృష్టమన్నారు. తరువాత సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల గైడెన్స్ సెల్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూచిన్న పరిశ్రమల ఏర్పాటుద్వారా పారిశ్రామికవేత్తగా ఎదగాలనుకుంటున్న యువత, మహిళలు పరిశ్రమల ఏర్పాటు గురించి అన్ని అంశాలను ఈకార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు. కొబ్బరి, అరటి మొదలైన పంటల ఉప ఉత్పత్తులను ఎలా తయారు చేయవచ్చు, ఇతర రకాల పరిశ్రమల ఏర్పాటుకు ఏ విధమైన అవకాశాలు ఉన్నాయనే సమాచారం ఈ గైడెన్స్ సెల్ అందిస్తుందన్నారు. యువత గానీ, డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళ కానీ ఆమె కుటుంబ సభ్యులు గానీ, మరెవరైనా గానీ పారిశ్రామికవేత్తగా ఎదగాలనుకుంటే ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలి, లోను ఎక్కడ లభిస్తుంది, అనుమతులు ఎలా వస్తాయి, సబ్సిడీ ఎలా వస్తుందిఅనేఅంశాలపై గైడెన్స్ఈకార్యాలయంలో అందిస్తారని తెలిపారు.ముందుగా 50నుంచి వంద మంది పారిశ్రామికవేత్తలను అయినా తయారుచేయాలనే లక్ష్యంతోరుణాలు అందించాలని బ్యాంకు వారిని కోరడం జరిగిందన్నారు.తద్వారాఅధికసంఖ్యలో పారిశ్రామిక వేత్తలను రూపొందించడానికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని యువత, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఆయన రావులపాలెం జూనియర్ కళాశాలలో విద్యార్థినుల కోసంనూతనంగా నిర్మించిన టాయిలెట్లను ప్రారంభించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనిఅత్యధికంగా విద్యార్థుల సంఖ్య ఉన్నది రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల అభివృద్ధికికృషి చేస్తుందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం,సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లను అందజేసిందని తెలిపారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందో, ప్రభుత్వం ఇచ్చిన దుస్తులు, షూస్ నాణ్యత ఎలా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తదనంతరం రావులపాలెం కొత్తకాలనీలో మహిళ సాధికారతా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్‌ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, పాలూరి సత్యానందం, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్ మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశు సంరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి

- రూ.కోటి రూపాయలుతో 55 మినీ గోకులాలు ఏర్పాటు
- కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం



**కె.గంగవరం, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం పాడి, పశు సంరక్షణకు తగిన ప్రాధాన్యం ఇస్తుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గురువారం కె గంగవరం మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కె గంగవరం మండలానికి ప్రభుత్వం కోటి రూపాయలకు పైగా నిధులు కేటాయించి 55 మినీ గోకులాలు మంజూరు చేసింది అన్నారు. పశు సంరక్షణకు, పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ నిధులను రైతులు సద్వినియోగం చేసుకొని సకాలంలో పశువుల షెడ్ లు నిర్మించుకోవాలని సూచించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో రామచంద్రపురం నియోజవర్గానికి అధిక సంఖ్యలో మినీ గోకులాలు మంజూరయ్యా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్ శ్రీనివాసరావు, పశు సంవర్ధక శాఖ ఏడి రామకృష్ణ, ఏపీఒ సురేంద్రబాబు, ఎంపీపీ పంపన నాగమణి, గంగవరం మండలం టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, మండల జనసేన అధ్యక్షులు చిర్రా రాజకుమార్, నేమాని సత్యనారాయణ (అబ్బు), ఆనందరావు, దొరబాబు, మొర్రేడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ మానుకోవాలి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలని సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేసారు. ప్రభుత్వ కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేటీకరణ మానుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర పిలుపులో భాగంగా రంపచోడవరంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి ఐటిడిఏ వరకు సిపిఐ నాయకులు, కార్యకర్తలు గురువారం ర్యాలీ నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం ఐటీడీఏ ఎపిఒ డి.ఎన్.వి.రమణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జుత్తుక కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తుల చేతిలో పెట్టి మరో దోపిడీకి తెర లేపిందని, నిరుపేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు నేను అండగా ఉంటానని కుర్చీ ఎక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు గోముదుర్గ మాట్లాడుతూ పేదలకు విద్య అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఆశ్రమ పాఠశాలలో నేటికీ సరైన విద్య అందడం లేదని కూటమి నాయకులు కార్పొరేట్ల ముందు మోకరిల్లుతున్నారని విమర్శించారు. డివిజన్ నాయకులు దినేష్ రెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి లేక సరైన రోడ్డు సదుపాయం లేక నేటికీ వైద్యం పూర్తిగా అందడం లేదని, పెన్షన్లు లేక కొంతమంది గిరిజనులకు జీవనం కష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ జిల్లా నాయకులు కత్తుల శ్రీనివాస్ రెడ్డి, లింగారెడ్డి, సోమిరెడ్డి, బంద్రెడ్డి చంద్రరావు, రాంబాబు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రంథాలయ సంస్థ సిబ్బంది సంక్షేమానికి కృషి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతి రాజు ఈశ్వర రాజు వర్మ (సాయిబాబు రాజు)ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాల సంస్థ ఉద్యోగుల సంఘం (31/2017) కార్యవర్గం సంఘం అధ్యక్షులు జి.వి.ఆర్.ఎస్.హెచ్.కే.వర్మ ఆధ్వర్యంలో మామిడికు దురు, గోగన్నమఠం గ్రామంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సేవలు అందించుటకు, గ్రంథాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సలాది సాయి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు రేపాక వెంకటరాము, కోశాధికారి జి.వి.వి.ఎన్.త్రినాథ్, ప్రచార కార్యదర్శి ములంపాక శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కే.కిషోర్, కే.శ్రీని వాస్, కార్యవర్గ సభ్యులు కే.పద్మజ,బి.నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- సీపీఐ డిమాండ్




**అమలాపురం, మేజర్ న్యూస్ :** పిపిపి పద్ధతిలో నూతన మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి అప్పచెప్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న జి.ఓ. 590 రద్దు చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సమితి ఆధ్వర్యంలో అమలాపురం మెడికల్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాలకు మెడికల్ విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వం నేడు జి.ఓ.590 తీసుకోవచ్చి గత ప్రభుత్వం తీసుకువచ్చిన 10 మెడికల్ కాలేజీలను ప్రైవేట్ రంగం వారికి అప్పచెప్పడం భారత కమ్యూనిస్టు పార్టీ ఖండిస్తుంది, మన రాష్ట్రంలో పేదలకు ఉచిత వైద్యం చేయాలి, వైద్య విద్య ను అభ్యసించాలని పేద వారి కోరికలను కలలను దూరం చేసి వైద్యం అమ్ముకునే కార్పొరేట్ వైద్యులను తయారుచేయడం కోసం కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్ వారికి అప్పచెప్తుంది, 66 సంవత్సరాలు లీజుకి ఇచ్చి, నిర్వహణ బాధ్యతలు వారికి ఇస్తే వేల కోట్లు నిధులు ఖర్చు పెట్టి ఉచితంగా విద్య, వైద్యం అందిస్తారని ప్రజలను మభ్యపెట్టాలని చూడడం సిగ్గుచేటని అన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కి 22,000 కోట్ల రూపాయలు రాయితీలు, కంపెనీలకు 99 పైసలకు వేల ఎకరాలు ఇవ్వగలిగిన వాళ్ళు 5000 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీలు కట్టలేము, నిర్వహించలేము అనడం కూటమి ప్రభుత్వం చేతకానితనం అనాలా లేక కార్పొరేట్ వారికి దాసోహం అనాలా, పిపిపి విధానం ఏ రాష్ట్రంలో కూడా విజయవంతం అవ్వలేదని గతం మర్చిపోవద్దని, ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే భారత కమ్యూనిస్టు పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సత్తిబాబు మాట్లాడుతూ ఇది ప్రజా ఉద్యమం, ప్రజా గొంతుగా సీపీఐ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేస్తుందని అన్నారు, పక్క రాష్ట్రాలు తమిళనాడు, కేరళలో గత ప్రభుత్వాలు చేసే ప్రజా ప్రయోజన కార్యక్రమాలు, పథకాలు ప్రస్తుత ప్రభుత్వాలు ముందుకు తీసుకువెళ్తున్నాయని, ప్రజల సొమ్మును వృథా చేయకుండా కూటమి ప్రభుత్వం కూడా మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని, నిర్వహణను ప్రభుత్వమే చేపట్టి ప్రజలకు ఉచిత వైద్యం, ఉచిత విద్యను అందించాలని కోరుతు న్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాము, వెంకటేష్, రామకృష్ణ, తాతాజీ, రవికుమార్, సమితి సభ్యులు చిట్టూరి ప్రసాద్, చిట్టూరి సత్యనారాయణ, గుత్తి నాగేశ్వరావు, ఆనంద్, ప్రేమానందం, తాడి సత్యనారాయణ, భీమరాజు, నాగబాబు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాల్ని అధిరోహించవచ్చు

**- బండారు రంగ ప్రసాద్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు**

**అమలాపురం /అల్లవరం,మేజర్‌న్యూస్ :** విద్యతోనే ఉన్నత శిఖరాల్ని అధిరోహించవచ్చని, విద్యార్థులు ఆదిశగా కష్టపడి చదువుకుని తల్లితండ్రులకు, పుట్టిపెరిగిన ఊరుకు మంచి పేరును తీసుకురావాలని ప్రముఖ సామాజిక సేవకురాలు, బండారు ఫౌండేషన్ ఛైర్మన్ బండారు శ్రీదేవి అన్నారు. అల్లవరం మండలం గోడి గురుకుల బాలుర పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అత్యుత్తమ స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం నగదు బహుమతులు, ప్రోత్సహకాలు బండారు శ్రీదేవి అందించారు. గ్రామ సర్పంచ్ తోట శ్రీదేవి నరసింహారావు సమక్షంలో ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీదేవి మాట్లాడుతూ తన తండ్రి దివంగత బండారు రంగప్రసాద్ పేరున పదిహేనేళ్ల క్రితం నుంచి ప్రతీ ఏటా పలు సేవాకార్యక్రమాలతోపాటు సాంఘిక సంక్షేమశాఖ పాఠశాలల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రతి ఏటా నగదు ప్రోత్సహాకాలు అందజేస్తున్నామని, ఈ ఏడాది కూడా ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందించామని తెలిపారు. అదేవిధంగా సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న బాలుర, బాలికల గురుకుల పాఠశాలలకు ప్రతీ ఏటా విద్యార్థులకు పలు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తోన్న శ్రీదేవికు కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి పేరుతో తన




భర్త సహకారంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీదేవికి అభినందనలు చెప్పారు.


**పాఠశాలకు ఇన్వర్టర్ ఇస్తానని హామీ..** బాలుర గురుకుల పాఠశాలలో విద్యుత్తు లేని సమయంలో చదువుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బండారు శ్రీదేవి దృష్టికి స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తీసుకురావడంతో స్పందించిన శ్రీదేవి ఇన్వర్టర్ బ్యాటరీలు కొనిస్తానని విద్యార్థుల సమక్షంలో వారికి హామీ ఇచ్చారు.

దీంతో విద్యార్థులు కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలి పారు. అనంతరం శ్రీదేవిని, సర్పంచ్ శ్రీదేవి నరసింహారావు దంపతు లకు స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.భుజంగరావు, హెల్త్ సూపర్ వైజర్ పి.నాగేశ్వర రావు, అధ్యాపకులుకడలినాగరాజు,వడ్డి వెంకటేష్, దాసరి సూర్య నారాయణ, బీ.హెచ్.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..
# 21న రంపచోడవరంలో మెగా మెడికల్ క్యాంప్

**- మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి రాక**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ఈనెల 21వ తేదీ ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. గిరిజన ప్రాంత ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ మెగా వైద్య శిబిరంలో రాజమండ్రి జిఎస్ఎల్, జిఎస్ఆర్ హాస్పిటల్స్ కు చెందిన వైద్యుల సహకారంతో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఉచిత వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తా రన్నారు. కాబట్టి ఎవరైనా అనారోగ్యంగా ఉన్నవారు మండల తెలుగు దేశం పార్టీని సంప్రదించి వారి పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా రంపచోడవరం నియోజకవర్గం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి సూచిం చారు. గిరిజన ప్రాంతంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఉచిత వైద్య సేవలు పొందాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ కమిటీ నాయకులు, గ్రామ




కమిటీ నాయకులు, యూనిట్ ఇన్చార్జులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేసారు.

# బాధితురాలికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలి

**- ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయల్**



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** పోక్సో కేసులో బాధితురాలి తల్లికి బాసటగా నిలుస్తున్న పౌర హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబానికి పూర్తి మద్దతు తెలుపుతూ, బాధితురాలికి ప్రభుత్వం తరపున తక్షణమే న్యాయం చేయాలని బొమ్మి ఇజ్రాయిల్ తెలిపారు. గురువారం ఉదయం ఐ.పోలవరం మండల పరిధిలోని బాణాపురం గ్రామానికి చెందిన దేవు నాగలక్ష్మి ఇటీవల బాణాపురం గ్రామంలో నమోదైన పోక్సో కేసు బాధితురాలి తల్లికి బాసటగా, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమర్తి రవి రిటైర్డ్ ఏఈ, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్, అమలాపురం ఆధ్వర్యంలో పోక్సో కేసులో ముద్దాయైన రాయపురెడ్డి సత్య వెంకటకృష్ణ అలియాస్ బాబీ, బాణాపురం అనువారికి బెయిల్ మంజూరు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఈనిర్ణయానికి వ్యతిరేకంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, పౌర హక్కుల సంఘాలు, దళిత సంఘాలకు చెందిన వారందరూ పాల్గొని నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ నిరసన కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమర్తిరవి,కారెం వెంకటేశ్వం రావు - సిపిఎం జిల్లా కార్యదర్శి, రేవు తిరుపతిరావు - పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు, జి.దైవ కృప ఐద్య ప్రెసిడెంట్, తులసి దుర్గారావు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు చేస్తున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని నేను ప్రకటిస్తున్నాను, పోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసుల్లో,ఈ మధ్య నమోదైన పోక్సో కేసుల్లో బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగేలా ప్రభుత్వంతక్షణ చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి భద్రత కల్పించాలని, ప్రభుత్వం తరపున ఆర్థికంగా ఆదుకోవాలని, ముద్దాయి తరపున ఉన్న ఆస్తులను జప్తు చేసి, దాని ద్వారా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి నా పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు.

## మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే రాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. గురువారం పెద్దాపురం పట్టణంలోని స్థానిక శ్రీ మట్టే ఆదినారాయణ ఆర్యవైశ్య సేవా సంఘ భవనం నందు ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం నందు మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు మాట్లాడుతు రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాల ద్వారా మహిళలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. అనంతరం వారి చేతుల మీదుగా ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సి పల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, పెద్దాపురం పట్టణ జన సేన అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, తహాశీల్దార్ సిహెచ్.వెం కటలక్ష్మీ, ఎం.ఎస్.ఓ.భారతి, గ్యాస్ ఏజెన్సీ అధినేతలు మండవిల్లి శ్రీనివాస ముత్యాలు, తలాటం గంగాధరరావు, వై.సత్యరమణి, కూటమి నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## బోధన రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) పాత్రపై మూడు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభం

**- అధ్యాపకులు కృత్రిమ మేధస్సుపై అవగాహన కలిగి ఉండాలి**
**- ప్రిన్సిపల్ సునీత**




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏలేశ్వరంలో పిఎం ఉషా స్కీమ్‌లో భాగంగా కృత్రిమ మేధస్సు పై మూడు రోజు ల శిక్షణ శిభిరంను కళాశాల ప్రిన్సిపాల్ డా.డి సునీత ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ చేస్తూ మారుతున్న నేటి సాంకేతిక పరిజ్ఞానంనకు అనుగుణంగా అధ్యాపకులందరూ శిక్షణ పొంది ఉండాలనే ఉద్దేశ్యంతో 18-20 తేదీల మధ్య మూడు రోజుల శిక్షణ శిభిరంను ఏర్పాటుచేశామ న్నారు. ఈ శిభిరంలో జెనెరటివే ఏఐ టూల్స్ ఫర్ ఎడ్యుకేటర్స్ అనే ప్రదాన అంశంతో శిక్షణ ఇవ్వబడుతుందని మొత్తం 50 మంది అద్యాపకులు వివిద కళాశాలల నుండి హాజరైనారని ఈ శిభిరం నందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడి పాఠ్య ప్రణాళిక, కంటెంట్ సృష్టి, మూల్యాం కనం, పరిశోధన మద్దతు వ్యక్తిగతీకరించిన అభ్యాసం కోసం ఏ ఐ సాధనాలు ఎలా వాడ వచ్చో హ్యాండ్స్ ఆన్ ప్రాక్టీస్ ద్వారా నేర్పిస్తారని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి జాయింట్ డైరెక్టర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డా. సిఎచ్ కృష్ణ ముఖ్య అతిదిగా ఆన్లైన్ లో హాజరై డిజిటల్ యుగంలో ప్రతి అధ్యాపకులు కృత్రిమ మేధ పై శిక్షణ పొందాలని కోరారు. ప్రత్యేక అతిథి గా డా. డి. చెన్నారావు, ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జగ్గంపేట హాజరై మానవ సేవలకై కృత్రిమ మేధస్సు ఒక అద్భుతమైన వనరని దాన్ని సవ్యంగా ఉపయోగించుకొని ముందుకు సాగాలని తెలియజేశారు. మరో అతిథి బసవ రాజు అసోసియేట్ డైరెక్టర్ బ్లాక్ బక్స్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ మాట్లాడుతూ ఏఐ సాంకేతిక జ్ఞానం ప్రతి ఒక్కరికీ నేడు ఆవశ్యకంగా మారిందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్స్ గా డా. ప్రయాగ మూర్తి ప్రగడ, కె సురేశ్ వ్యవహరిస్తున్నారు. నారాయణ స్వామి, బ్లాక్ బక్స్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె వేంకటేశ్వర రావు , అధ్యాపకులు వి . రామా రావు, డా. మదీనా, డా. శివ ప్రసాద్, శ్రీలక్ష్మి, వీరభద్ర రావు, డా. బంగార్రాజు, సతీశ్, మేరీ రోజలీనా, పుష్పా, రాజేష్ సత్యనారాయణ, ధర్మ రాజు , దివ్య, రామలక్ష్మి, కమల, కళావతి, వివిద కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన భాష్యం బాలుర ఇంట్రా స్పోర్ట్స్ మీట్





**శంఖవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి భాష్యం పాఠశాల బ్రాంచ్ నందు భాష్యం వాలంపస్ క్రీడల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ స్పోర్ట్స్ మీట్‌ను ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా చేతుల మీదుగా అత్యంత వైభవంగా ప్రారంభమైనాయి. ఈ క్రీడలను ఎమ్మెల్యే సత్య ప్రభ జ్యోతి ప్రజ్వలన మరియు జాతీయ జెండా ఆవిష్కరణ చేయగా భాష్యం ఈస్ట్ జోన్ వన్ జోనల్ ఇన్చార్జ్ వి.గోవిందరాజు భాష్యం పాఠశాల జెండాను, కత్తిపూడి భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ ధన అర్జున్ స్పోర్ట్స్ జెండాను ఆవిష్కరణతో ప్రారంభించారు. క్రీడాజ్యోతిని ఎమ్మెల్యే సత్యప్రభ వెలిగించి క్రీడలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ శారీరక మరియు మానసిక ఆరోగ్యానికి విద్యార్థులకు క్రీడలు ఎంతో ఆవశ్యకమని వాటిని భాష్యం విద్యాసంస్థలు కాకినాడ జిల్లాలోని ఉన్న పదకొండు బ్రాంచ్ లు సుమారు 500 విద్యార్థులను ఒకే చోటుకి తీసుకువచ్చి నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. వి.గోవిందరాజు మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ ఆలోచన మేరకు భాష్యం పాఠశాలలో చదివే విద్యార్థులందరికీ ఫిజికల్ ఎడ్యుకేషన్ పాఠ్యప్రణాళికలో అంతర్భాగం చేసి జూన్ నుండి జనవరి దాకా బ్రాంచ్ లెవెల్ మరియు జోనల్ లెవెల్ మరియు సెంట్రల్ లెవెల్‌గా భాష్యం వలంపస్ పేరుతో క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు ఈ క్రీడలలో కబడ్డీ, కోకో, బ్యాట్మెంటన్, చెస్, క్యారమ్స్ మరియు క్రికెట్లను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 11 బ్రాంచ్‌లకు చెందినటువంటి ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్, శ్రీనివాస్ గుప్తా, చంద్రశేఖర్, వేణు, అనిల్, సూర్య, దివాకర్, రంగబాబు, సత్యనారాయణ, భాస్కర్, అన్ని బ్రాంచీల పీడీలు పాల్గొన్నారు. కత్తిపూడి భాష్యం పాఠశాలలో జోనల్ లెవెల్ క్రీడలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని కూటమి నాయకులు వెన్న ఈశ్వరుడు, శివ, పర్వత సురేష్ మరియు బద్ది రామారావు మొదలగు నాయకులు కొనియాడారు. గెలుపొందిన క్రీడాకారులకు శంఖవరం మండల ఎంఈఓ వెంకటరమణ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.

బాలుర విభాగంలో విన్నర్స్ కబడ్డీ సీనియర్స్ తుని బ్రాంచ్, రన్నర్స్ రామచంద్రపురం; చెస్ జూనియర్స్ విన్నర్స్ శాంతినగర్ కాకినాడ వన్, రన్నర్స్ విద్యుత్ నగర్ కాకినాడ–2; చెస్ సీనియర్స్ విన్నర్స్ తుని, రన్నర్స్ రామచంద్రపురం; క్యారమ్స్ విన్నర్స్ తుని, రన్నర్స్ జగ్గంపేట; బ్యాట్మెంటన్ జూనియర్స్ విన్నర్స్ విద్యుత్ నగర్, రన్నర్స్ పిఠాపురం. ఈ కార్యక్రమంలో భాష్యం జోనల్ ఇంచార్జ్ వి.గోవిందరాజు, పాఠశాల ప్రిన్సిపల్ ధన అర్జున్, ప్రైమరీ హెచ్‌ఎం కాత్యాయని పాల్గొన్నారు.

# కానూరు పిహెచ్సి ఆధ్వర్యంలో పోలియో సన్నాహక సమావేశం



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డిసెంబర్ 21 వ తారీఖున జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం గురించి డిసెంబర్ 18వ తేదీ గురువారం ఏయన్యమ్ లు, ఆశాలు, యమ్మెల్హెచ్పి లు, అంగన్వాడీ సూపెర్వైజర్స్, టీచర్ లకు ఈ కార్యక్రమం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.21 వ తేదీన జరుగు ఈ కార్యక్రమంలో 0 నుండి 5 సంవత్సరాలు ఉన్న పిల్లలు అందరికి పోలియో చుక్కలు వేయించాలని దానియొక్క ఆవశ్యకతను గురించి తెలియచేయడం జరిగింది. 21 వ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వేయబడును మరియు ఆరోజు రాని పిల్లలకు మరుసటి రోజు ఇంటికి వెళ్లి చుక్కలు వేయటం జరుగుతుంది అని చెప్పటమయినది.గ్రామంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలు ఉన్న ప్రతీ బిడ్డకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేసి వారికీ ఆరోగ్య వంతమయిన భవిష్యత్ ఇవ్వాలని ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమం వినియోగించుకోవాలని మరియు విజయవంతం చేయాలని వైద్యాధికారులు తెలియజేసారు. నిండు జీవితానికి రెండు చుక్కలు వేయిద్దాం అన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కె.హేమరాజు, డాక్టర్ పి. తేజశ్రీ, సిహెచ్ఓకే. జయమణి, యమ్ పిహెచ్ఈఓఏ. రాజమోహన్, సూపెర్వైజర్ కే. వి. నాగేశ్వరావు మరియు సిడిపిఓ యన్.ఆశా రోహిణి, సూపెర్వైజర్ లు సరోజినీ,హసీనా, అంగన్వాడీ టీచర్స్ వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

# రోటరాక్ట్ యువతి సభ్యులచే రక్తదానం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రోటరాక్ట్ యువతి క్లబ్ సభ్యులచే తొలి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక వి.ఎస్.లక్ష్మి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఘనంగా నిర్వహించబడింది. కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య తొలుత రక్తదానం చేయగా రోటరాక్ట్ యువతి సభ్యులు మరియు కళాశాల విద్యార్థినిలు భారీ సంఖ్యలో రక్తదానం చేశారు. ఈ బ్లడ్ డొనేషన్ క్యాంపు ను వి.ఎస్. లక్ష్మి కళాశాల కార్యదర్శి పి.కుమారస్వామి (రాజా వర్మ), వైస్ ప్రెసిడెంట్ వి.శ్రావ్యా లు కలిసి లాంఛనంగా ప్రారంభించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి నల్లమిల్లి మాచారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న రోగులను కాపాడేందుకు ఎంతో వీలు కలుగుతుందని అన్నారు .స్వచ్ఛంద రక్తదానానికి విద్యార్థిని విద్యార్థులు ముందుకు రావాల్సిందిగా కోరారు. ఒకరు రక్తదానం చేస్తే నలుగురికి ప్రాణదానం చేసే అవకాశం కలుగుతుందన్నారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రంతో పాటు ఇన్సూరెన్స్ తాలూకు పత్రాన్ని కూడా అందజేయబడుతుందని అన్నారు. ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయడం శ్రేయస్కరమని దాని ద్వారా ఆరోగ్యంగా జీవించడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్తదానం చేయడంపై నేటికీ అపోహలు ఉండడం దురదృష్టకరమని నల్లమిల్లి మాచారెడ్డి అన్నారు .రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిరంతరం సకాలంలో రక్తాన్ని అందజేస్తూ రోగుల ప్రాణాలను కాపాడుతున్నామని చెప్పారు. అత్యధిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయడమే కాక బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించాల్సిందిగా కోరిన యెడల వారు సూచించిన ప్రాంతంలోనే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని,



అందుకోసం సంచార రక్తదాన సేకరణ ప్రత్యేక వాహనం కూడా రోటరీ బ్లడ్ బ్యాంకు అందుబాటులో ఉందని నల్లమిల్లి మాచారెడ్డి చెప్పారు.రక్తదానం చేసిన వి.ఎస్.లక్ష్మి మహిళ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య కు రోటరీ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ ముత్తా నవీన్ మరియు రోటరీ ఆర్ఐసి చైర్మన్ చిరంజీవి రెడ్డిలు సంయుక్తంగా ప్రత్యేక సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్, కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ్ చక్రవర్తి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ తాళ్లూరి శ్రీనివాసరాజు, బదిరెడ్డి వెంకన్న, ఉమామహేశ్వరరావు, మాజేటి పవన్, చోడిశెట్టి పద్దరాజు, రోటరాక్ట్ యువతి కమిటీ అధ్యక్షులు పి.ఎన్.వి.సాయి స్వరూప్, కార్యదర్శి డి.చాందిని, ఉపాధ్యక్షులు ప్రీతి, సంయుక్త కార్యదర్శి వి.సీత, కోశాధికారి హర్ష, బోర్డు సభ్యులు కిట్టు, సాయి రాఘవ, షర్మిల రెడ్డి, పావని, ప్రశాంతి, దుర్గా కార్తీక, పీ.గంగ ఈశ్వరి తోపాటు రోటరీ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కామరాజు పాల్గొన్నారు.

## అన్నవరప్పాడు వెంకన్న ఆలయ పునఃనిర్మాణానికి 2 కోట్ల రూపాయలు మంజూరు

– మంత్రి దుర్గేష్ ప్రత్యేక కృషితో సాధ్యమైన శ్రీవారి భక్తుల కల



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు నిడదవోలు నియోజకవర్గ శాసనసభ్యులు కందుల దుర్గేష్ కృషితో అన్నవరప్పాడు వెంకన్న భక్తుల చిరకాల వాంఛ కోరిక నెరవేరింది. అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పునర్మాణము నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, దేవాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణ రెడ్డి, కమిషనర్ కే రామచంద్ర మోహన్ లు వెంకన్న ఆలయ పునర్నిర్మాణానికి రూ 2 కోట్ల రూపాయలు మంజూరు ఉత్తర్వులు ఇచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి మీసాల రాధాకృష్ణ మేజర్ న్యూస్ కు తెలియజేశారు. డిసెంబర్ 18వ తేదీ గురువారం ఈవో రాధాకృష్ణ మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూ గోదావరిపుష్కర నిధులు నుండి అన్నవరప్పాడు వెంకన్న ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో రాబోయే పుష్కరాలకు ముందే ఆలయ నిర్మాణం సాధ్యమవుతుంది అన్నారు. మంత్రి దుర్గేష్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆలయపున నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం పట్ల అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు అన్నవరప్పాడు మరియు పరిసర గ్రామ ప్రజలు శ్రీవారి భక్తులు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసినారు. నిధులు మంజూరుకు విశేష కృషి చేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు మరియు ఇంజనీరింగ్ అధికారులకు అన్నవరప్పాడు మరియు పరిసర గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలియజేశారు.

## బిజెపి నాయకుడు రంగినీడి గంగాధర్ కుమారుడు ఆకస్మిక మరణం



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు పెరవలి మండలం అన్నవరపాడు గ్రామానికి చెందిన రంగనీటి గంగాధర్ కుమారుడు బాబి డిసెంబర్ 18వ తేదీ గురువారం ఆకస్మికంగా మృతి చెందడంతో అన్నవరప్పాడు గ్రామంలో విషాదఛాయలు నెలకొ న్నాయి. ఈ వార్త తెలిసిన వెంటనే వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు.

## బాలుని వైద్యానికి చిన్నారుల పెద్ద మనసు చేసుకున్న ప్రతిభ స్కూల్ విద్యార్థులు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** బాలుని వైద్యానికి చిన్నారులు పెద్ద మనసు చేసుకున్నారు. సామర్లకోట పట్టణంలోని బలుసుల పేటలోని ఒక పేద కుటుంబానికి చెందిన బాలుడు పేరూరి సాయికుమార్ లివర్‌కి వచ్చిన ఆరోగ్య సమస్యను గుర్తించి దాని వైద్యానికి అయ్యే అధిక ఖర్చుల నిమిత్తం స్థానిక ప్రతిభ పాఠశాల విద్యార్థులు తమవంతు సహాయాన్ని అందజేశారు. దాతల సహాయం కోసం మీడియాలలో వచ్చిన వార్తకు స్పందించిన ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులు ఆబాలుడు త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరగాలని ఆకాంక్షిస్తూ, వారివంతు సహాయంగా తల్లిదండ్రులు నుంచి సేకరించి రూ.70,000లు బ్యాంకుచెక్‌ను ఈరోజు గురువారం పాఠశాల అసెంబ్లీలో పాఠశాల విద్యార్థి నాయకులు, కరెస్పాండెంట్ ఎస్విజి ప్రకాష్‌ల చేతులమీదుగా ఆ బాలుని తల్లిదండ్రులకు అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు బాలుడు త్వరగా కోలుకుని తిరుగడాలని ఆకాంక్షిస్తున్నామని, తల్లిదండ్రులను ధైర్యంగా ఉండమని తెలియచేశారు. బాలుడి వైద్యానికి పెద్ద మనసుతో ముందుకొచ్చి సహకరించిన చిన్నారులను పలురువు అభినందించారు.

## వలస వెళ్లే వారి హక్కులను రక్షించడమే అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం

**– డిఆర్ఓ నోడల్ అధికారి కొత్త మాధవి**




**అమలాపురం, మేజర్ న్యూస్ :** స్థానికంగా సరైన జీవనోపాధి అవకాశాలు లభించక, మెరుగైన ఉపాధి కోసం, వివిధ కారణాల మూలంగా తమ స్వస్థలాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారి హక్కులను రక్షించడం వారి సమస్యలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు డిఆర్ఓ కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి కొత్త మాధవి అన్నారు. గురువారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం నందు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవాన్ని సిబ్బందితో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా సరైన ఉపాధి అవకాశాలు లభించక విదేశాలకు వెళ్లి తమ కుటుంబాలను పోషించుకోదలచిన వారికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కోనసీమ వలసదారుల కేంద్రం ఒక దిక్సూచిగా నిలిచి విదేశాలలో చట్టబద్ధమైన సురక్షిత ఉపాధిని కల్పించేందుకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. వలసలు వెళ్ళదలచినవారు తప్పనిసరిగా ఈ కేంద్రాన్ని సంప్రదిస్తే విదేశాలలో సుస్థిర జీవనోపాదులు కల్పనకు మార్గనిర్దేశం చేస్తుందన్నారు. మెరుగైన ఉపాధి కోసం, ఇతర కారణాల వల్ల తమ స్వస్థలాలను వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారి హక్కులను రక్షించడం కోసం ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ 'వలస కార్మికులు వారి కుటుంబ సభ్యుల హక్కుల పరిరక్షణ' పై అంతర్జాతీయ ఒడంబడికను ఆమోదించిం దన్నారు. వలసదారుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో 2000 డిసెంబర్ 4న ఐక్యరాజ్యసమితి డిసెంబర్ 18ని అంతర్జాతీయ వలసదారుల దినోత్సవంగా అధికారికంగా ప్రకటించిందన్నారు.

వలసదారులు ఎదుర్కొంటున్న వివక్ష, దోపిడీ, మానవ హక్కుల ఉల్లంఘనల గురించి ప్ర పంచ దేశాలను అప్రమత్తం చేస్తూ. ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో, సంస్కృతిలో సామాజిక మార్పులో వలసదారులు పోషిస్తున్న కీలక పాత్రను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఈ 2025 సంవత్సరానికి గాను సంస్కృతులు అభివృద్ధి అనే ఇతివృత్తాన్ని ప్రాధాన్యతగా తీసుకొని ఆ దిశగా విస్తృత అవగాహనను పెంపొందించామన్నారు. వలసదారుల ప్రయాణాలు కేవలం కదలికలు మాత్రమే కాదని, అవి వివిధ సంస్కృతుల కలయికకు, అభివృద్ధికి దారితీసే గొప్ప కథలను ఈ దినోత్సవం తెలియజేస్తుందన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో ప్రజలు వలసదారులుగా జీవిస్తున్నారన్నారు. ప్రపంచాన్ని ముందుకు నడిపించే వారి శ్రమను గుర్తిస్తూ ప్రతి వలసదారుడికి గౌరవం, భద్రత, సమాన అవకాశాలు అందాలని ఆమె అభిలాషించారు. ఈ కార్యక్రమంలో కేసీఎం మేనేజర్ గోళ్ళ రమేష్, రెవెన్యూ సిబ్బంది కేసీఎం సిబ్బంది సఫియా, దుర్గా, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ నగరపాలక సంస్థలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనిషా బాధ్యతల స్వీకరణ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థలో జరుగుతున్న కార్యకలాపాలను సమగ్రంగా అవగాహన చేసుకునే భాగంగా శిక్షణలో ఉన్న అసిస్టెంట్ కలెక్టర్ మనిషా మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. శిక్షణ కాలంలో భాగంగా వారం రోజుల పాటు నగరపాలక సంస్థలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ, రోజువారీ పరిపాలనా కార్యకలాపాలను అధ్యయనం చేయనున్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాస్, ఎస్ఈ పి.వెంకట్రావు, కార్పొరేషన్ మేనేజర్ సీతారాం తదితర అధికారులు ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మనిషాను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ అధికారులు ఆమెకు స్వాగతం పలుకుతూ పరిచయం చేసుకున్నారు.



# తప్పులు మీవి... నిందలు మాకా?

**– వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలకు మంత్రి కందుల దుర్గేష్ ఘాటు కౌంటర్**



**పెరవలి, మేజర్ న్యూస్ :** వైసీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి భూమన కరుణాకర్ రెడ్డి తిరుపతిలో ఒబెరాయ్ హోటల్‌కు భూకేటాయింపులపై చేసిన వ్యాఖ్యలకు మంత్రి కందుల దుర్గేష్ ఘాటుగా సమాధానమిచ్చారు. సోషల్ మీడియా వేదికగా, వివిధ ప్రసార మాధ్యమాల్లో ఆయన చేసిన ఆరోపణలు ఖండిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ కేటాయింపుల నేపథ్యం తెలియకుండా ఆరోపణలు చేయడం సరికాదని, తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలతో ఆడుతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్తే గత ప్రభుత్వం జి.ఓ. నెం. 24 (తేదీ: 24.11.2021) ద్వారా తిరుమల కొండ పాదాల వద్ద ఉన్న పేరూరు గ్రామంలోని సర్వే నంబర్ 604లో 20 ఎకరాల భూమిని ముంతాజ్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఒబెరాయ్ గ్రూప్ అనుబంధ సంస్థ) కు కేటాయించింది. రూ.250 కోట్ల పెట్టుబడితో 100 విల్లాలు, రెస్టారెంట్లు, బాంకెట్ హాల్, స్పా, ఫిట్ నెస్ సెంటర్, కాఫీ షాప్, బార్ తదితర విలాసవంతమైన సౌకర్యాలతో 'ఒబెరాయ్ (విలాస్) రిసార్ట్స్' అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యమని, తద్వారా 1,500 మందికి ఉపాధి లభిస్తుందని నాడు చెప్పి ప్రాజెక్టు ఆమోదించి మీరు కాదా అని భూమనను మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు. 9 జూలై 2023న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ధార్మిక సంస్థలు, కీలక వాటాదారులతో సంప్రదింపులు జరపకుండా ఈ ప్రాజెక్టుకు వర్చువల్‌గా పునాది రాయి వేయడంతో తిరుమల పవిత్రతను కాపాడాలని కోరుతూ ధార్మిక సంస్థలు, ప్రజల నుండి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమైన మాట వాస్తవం కాదా అని నిలదీశారు.

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజా సెంటిమెంట్‌ను గౌరవిస్తూ, టీటీడీ బోర్డు తీర్మానం (జీవో నెం. 102, తేదీ: 18.11.2024) ద్వారా కేటాయింపును రద్దు చేయాలని కోరింది. దీని ప్రకారం ప్రభుత్వం 07.08.2025న లీజును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని మంత్రి దుర్గేష్ తెలిపారు. గత నాలుగేళ్లుగా ఈ ప్రాజెక్ట్ నిలిచిపోవడం వల్ల అనేక పరిణామాలు చోటుచేసుకోవడంతో ప్రాజెక్ట్ తయారీ పనుల కోసం వెచ్చించిన రూ.14 కోట్ల పెట్టుబడి నిధులు, నిర్మాణ సమయం, నియామకాలు, శిక్షణలో కీలకమైన సమయం వృధా అయిందని ఒబెరాయ్ సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది.

అదే సమయంలో రాష్ట్రానికి పర్యాటక ఆదాయం, బ్రాండ్ గుర్తింపు విషయంలో నష్టం వాటిల్లింది. ఇది భర్తీ చేయాల్సిందెవరని మంత్రి దుర్గేష్ ప్రశ్నించారు. దీనికంతటికి కారణం గత ప్రభుత్వం కాదా అని ఫైర్ అయ్యారు. సరిదిద్దుకోలేని తప్పులు చేసిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలు మోపడం ఎంత వరకు సమంజసమని మంత్రి దుర్గేష్ అన్నారు.

## కుళాయి పన్ను చెల్లించకపోతే... కుళాయి కట్

**– మొండి బకాయిదారులపై మున్సిపల్ అధికారులు కొరడా**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయానికి చెల్లించవలసిన ఇంటి పన్నులు కొళాయి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, షాపు రెంటల్స్ చెల్లించవలసిన మొండి బకాయిదారులపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఏళ్ల తరబడి ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు చెల్లించని బకాయి దారుల ఇంటి కుళాయిలు కట్ చేస్తున్నారు. మున్సిపాలిటీకి పెద్ద మొత్తంలో బకాయిదారులైన క్రిస్టియన్ మెడికల్ సెంటర్ సిఎంసి ఆసుపత్రి వారు3.5 కోట్లు, షుగర్ ఫ్యాక్టరీ వారు 2.14 కోట్లు బకాయిలు ఉండడంతో వారికి ఆక్యుఫెన్సీ నోటీసు జారీ చేసినట్లు రెవెన్యూ అధికారి వైవి మోహనరంగా తెలిపారు. మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పిఠాపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో మొండి బకాయి దారుల ఇంటి కుళాయిలు కట్ చేశారు. మున్సిపల్ కమిషనర్ బి. రాజు సూచన మేరకు బకాయిదారులకు రెడ్ నోటీసులు అందజేసి స్పందించని వారిపై చర్యలకు ఆదేశించారు. నవంబర్, డిసెంబర్ నెలలో ఖాళీ స్థలం పన్నులు రూ.25 లక్షలు, ఇంటి పన్నులు రూ.79 లక్షలు, షాపు అద్దిబకాయిలు రూ. 47 లక్షలు, కుళాయి పన్నులు రూ. 85 లక్షలు వసూలు చేసినట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీకి చెల్లించవలసిన అన్ని రకాల బకాయిలు తక్షణం చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. బకాయిలు చెల్లించని వారి కుళాయిలు తొలగించే కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ బి. తిరుమల, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి హేమశ్రీ సేవలు అభినందనీయం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :**మండలంలోని లోతట్టు గిరిజన ప్రాంతమైన లో దొడ్డి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన హేమశ్రీ సేవలు అభినందనీయమని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. హేమశ్రీ, పెద్దపురం మండలం, మర్లవ గ్రామ పంచాయతీకి పదోన్నతి పై వెళుతున్న నేపద్యంలో పంచాయితీ సర్పంచ్ లోత రామారావుఆధ్వర్యంలో,ఉప సర్పంచ్ వార్డు సభ్యులు సచివాలయం సిబ్బంది, లోదొడ్డి గ్రామ సచివాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్రామపంచాయతీ సర్పంచ్ లోతా రామారావు మాట్లాడుతూ.లోదొడ్డి గ్రామపంచాయతీ కార్యదర్శిగా హేమా శ్రీ మూడున్నర సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించారని, ప్రజలకు ఏ సమస్య వచ్చిన సమస్య పరిష్కారానికి కృషి చేసే రన్నారు.అలానే అదే సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేసిన అడ్డతీగల మండలం,దుచ్చర్తి సచివాలయం నికి బదిలీలో వెళ్లిన కృష్ణారెడ్డిని కూడా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పొత్తూరి సత్యనారాయణ, కోటంశెట్టి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,వీఆర్వో లు చదల వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి,ఆశ వర్కర్లు, ఏఎన్ఎం లు శ్రీనివాస్, సత్యనారాయణ, తేజ, కృష్ణ, రాజేశ్వరి, భవాని, గంగ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యసాధనలో అలుపెరుగని ప్రయాణం చేయాలి





## – ప్రముఖ సినీనటుడు సుమన్

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ప్రముఖ సినీ నటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత శ్రీ సుమన్ తల్వార్ విద్యార్థులతో ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. తెలుగు సినీ వినీలాకాశంలో హీరోగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు పొంది, అన్ని తరాల ప్రేక్షకుల మన్ననలుపొంది, వెంకటేశ్వర స్వామి అంటే ఇలాగే ఉంటారనిపించే అందాల నటుడు, ఆదిత్య విద్యాసంస్థలకి అత్యంత ఆత్మీయులైన హీరో సుమన్ తల్వార్ ఆదిత్య డిగ్రీ కళాశాలకు విచ్చేసి విద్యార్థులు మరియు అధ్యాపకులతో జరిగిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలలో పాఠ్యాంశాలతో పాటు, సేవా కార్యక్రమాలకు,భాష,సాహిత్య, కళారంగాలకు ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. కళలు మానసిక ఆనందానికి దోహదపడతాయని, మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయని అన్నారు. ఆదిత్య విద్యాసంస్థలలో సేవలందించిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ప్రస్తుత సినీ రంగంలో ఉన్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ హీరో సుమన్ మాట్లాడుతూ ఈ స్థాయికి తనను నడిపించిన తల్లిదండ్రులకు గురువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తన జీవితంలో సాధించిన విజయాలను అపజయాలను తెలిపారు. తన విజయం వెనుక తన తల్లిదండ్రుల కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. సినిమా ప్రపంచానికి పరిచయమైన నాటినుండి నేటి వరకు జరిగిన సంఘటనలను ఎదుర్కొన్న తీరు వివరించారు.

అన్నమయ్య సినిమాలో శ్రీ వెంకటేశ్వరునిగా చేసిన పాత్ర ద్వారా తనకు వచ్చిన గౌరవాన్ని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యసాధనలో అలుపెరుగని ప్రయాణం చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను గురువులను గౌరవించమని అన్నారు.ఇంతచక్కటి వాతావరణంలో కళాశాలను నిర్వహిస్తున్న ఆదిత్య విద్యా సంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా హీరో సుమన్‌ను ఆదిత్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖధిపతి టీ తేజేశ్వరరావు, అధ్యాపకులు డి అశ్విని, కె సుభాషిని, అధ్యాపకులు, అభిమానులు, డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందుగోపూజ, శ్రీ లక్ష్మీగణపతి హెూమం





## పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మలబాబు, అధికారులు

**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీమరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ విశ్వవసు నామ సంవత్సరం మార్గశిర బహుళ చతుర్దశి పురస్కరించుకుని గురువారం ఉదయం దేవస్థానం వవంశపారంపర్య ఛైర్మన్ చింతపల్లి శ్రీహర్ష, దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గోపూజ, తదుపరి శ్రీ లక్ష్మీగణపలి హెూమం, వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈకార్యక్రమానికిముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు,పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి ముందుగా శ్రీమరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ కార్యక్రమంలో పెద్దాపురం పట్టణ జనసేన అధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు, కూటమి నాయకులు, దేవస్థాన సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవేణుగోపాల స్వామి వారి ఆలయంలో ఘనంగా ప్రసాద వితరణ





**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం, దేవాలయం వీధి, కాకినాడ నందు ధనుర్మాసమును పురస్కరించుకుని డిసెంబరు 17 బుధవారం నుండి ధనుర్మాస ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణ జరుగును. ప్రసాద వితరణ ఉదయం 7.30 నుండి ఉదయం 9 గంటల వరకు జరుగును. ఈ ప్రసాద వితరణ కార్యక్రమానికి కులప్రసక్తి లేకుండా యావన్మందీ భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించవలసిందిగా ప్రసాద వితరణ కమిటీ వారు తెలిపారు. స్వామి వారిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుమారుడు మోహన్ వర్మ దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. ఈ ప్రసాద వితరణ కార్యక్రమానికి విరివిగా విరాళములు అందించిన దాతలకు కమిటీ వారు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ వెత్సా మురళి, ఎఎంసి ఛైర్మన్ బచ్చు శేఖర్, 30 వ వార్డు టిడిపి ఇన్చార్జ్ అద్దేపల్లి గంగరాజు, శ్రీ బాలా త్రిపుర సుందరి దేవస్థానం ఛైర్మన్ గ్రంధి బాబ్జి, దంగేటి సతీష్, దంగేటి నూకాజీ, సోమిశెట్టి కుమార్, చెక్కా ప్రకాష్, పి.కుమార్, చెక్కా సత్యనారాయణ, గుర్రాల శ్రీను, ఎం.నరేష్, పి.సతీష్, అమన్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నికుల క్షత్రియులకు తెదేపా ఎల్లప్పుడూ అండగా ఉంటుంది



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం ఆవిర్భావం నుంచి అగ్నికుల క్షత్రియులకు, పార్టీకి అవినాభావ సంబంధం ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. గురువారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో జిల్లా అగ్నికుల క్షత్రియ నాయకులు ఎమ్మెల్యేని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు తెదేపా ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. వాడపల్లి ఆలయం వద్ద పినపోతు గజేంద్రుడు విగ్రహ ఏర్పాటు జరుగుతుందన్నారు. దేవస్థానం పాలకమండలిలో అగ్నికుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన మసకపల్లి త్రిమూర్తులును ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించిన ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వాడపల్లి ఆలయ పాలకమండలిలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సభ్యులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. దానితో హెూంమంత్రి అనిత సూచించిన మత్స్యకార సామాజికవర్గానికి చెందిన అప్పల నరసకు స్థానం లభించిందని తెలిపారు. వాడపల్లి దేవాలయాన్ని నిర్మించిన పినపోతు గజేంద్రుడు మన నియోజకవర్గంలోని అగ్నికుల క్షత్రియులు కావడంతో మన నియోజకవర్గంలో సైతం ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యత దక్కాలని తాను ముఖ్యమంత్రి చంద్రబాబుకి తెలియజేయడం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారని, వెంటనే మసకపల్లి త్రిమూర్తులుకు పాలక మండలిలో ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానం కల్పిస్తూ జీవో ఇవ్వడం జరిగిందన్నారు. మొంథా తుఫాను సమయంలో సైతం జిల్లాలో 28 వేల మందికి 50 కేజీల బియ్యం 6 రకాల నిత్యవసర సరుకులను అందజేశారని తెలిపారు. వేట నిషేధం సమయంలో ఇచ్చే ఆర్థిక సాయం సైతం రూ.20 వేలకు పెంచడం జరిగిందన్నారు. అంతర్వేది ఆలయానికి సంబంధించిన అంశాన్ని సైతం దేవాదాయ శాఖ మంత్రి వాడపల్లిలో పర్యటించినప్పుడు ఆయన దృష్టికి తీసుకువెళ్దామని అగ్నికుల క్షత్రియ సామాజికవర్గ నేతలతో అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, పాలూరి సత్యానందం మరియు అగ్నికుల క్షత్రియ నాయకులు పాల్గొన్నారు.

# విజ్ఞానానికి సైన్స్ ప్రదర్శనలు దోహదం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న సైన్స్ ప్రద ర్శనలు విద్యార్థుల విజ్ఞానానికి ఎంతగానో దోహద పడతాయని కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పి.ఎస్.రాజు, ఎంఈఓ వర ప్రసాదరావు, సత్యనారాయణ లు అన్నారు. గురువారం ఆత్రేయపురం మహాత్మా గాంధీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో మండల విజ్ఞాన ప్రదర్శన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం సృజనాత్మను విజ్ఞాన ప్రదర్శనలు పెంపొందిస్తాయన్నారు. మండలంలో తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలల నుండి విద్యార్థులు 7 థీమ్‌లలో ప్రదర్శించిన 65 ప్రాజెక్టులు వీక్షకులను ఆకట్టుకున్నాయనీ, సుమారు 100 మంది విద్యార్థులు 20 మంది ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనా కార్యక్రమంలో పాల్గొన్నారని అన్నారు.

మండల స్థాయిలో 7 థీమ్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రాజెక్టులు జిల్లా స్థాయి పోటీలకు పంపించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఎస్.వి.వి.ఎన్.ఎస్.ప్రసాద్, పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆఫీసు సిబ్బంది రాంబాబు, బాబీ, సి.ఆర్.ఎంటిలు సుధాకర్, ఆత్మారావు, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.